అంతర్గత రహదారులపై గుంతలు

- అవస్థలు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



హుస్నాబాద్ కాలనీలో గుంతలమయంగా మారిన రోడ్డు



రాంనగర్ వెళ్లేదారిలో రోడ్డు దుస్థితి

ఆర్మూర్‌టౌన్ : మున్సిపల్ పరిధిలోని అంతర్గత రోడ్లపై గుంతలు ఏర్పడటంతో పట్టణ ప్రజలు అవస్థలు పడుతున్నారు. గుంతల్లో వర్షపు నీరు నిలువ ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతర్గత రోడ్ల మరమ్మతులను అధికారులు మరిచిపోయారు. చిన్నపాటి వర్షం కురిసినా రహదారులు గుంతలు వర్షపు నీటితో పూర్తిగా నిండిపోతోంది. ఆ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. రోడ్లు గుంతలు, కంకర తేలి ప్రమాదకరంగా తయారయ్యాయి. జిరాయత్‌నగర్ వెళ్లేదారిలో బాలుర పాఠశాల ఎదుట చిన్నపాటి చినుకులకు వరదనీరు చేరడంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హుస్నాబాద్ కాలనీకి వెళ్లేదారి పూర్తిగా గుంతలు ఏర్పడ్డాయి. ఆ రహదారి గుండా ప్రయాణించాలంటే ప్రజలు జంకుతున్నారు. ఇకనైనా అధికారులు అంతర్గత రోడ్లను సందర్శించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

గుంతలను పూడుస్తాం



గుంతల వల్ల ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. రోడ్లపై ఏర్పడిన గుంతలను త్వరలో మరమ్మతులు చేయిస్తాం. పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తాం.

– రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

క్లుప్తంగా

కూరగాయల షెడ్ నిర్మాణానికి భూమి పూజ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రైతు బజార్‌లో నూతనంగా నిర్మాణం చేపట్టనున్న కూరగాయల షెడ్డు నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య గురువారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్‌మున్ను, మున్సిపల్ కమిషనర్ రాజు, సర్వ సమాజ్ అధ్యక్షుడు ఆకుల రాజు, కౌన్సిలర్లు, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

పసుపు బోర్డుకు నిధులు తీసుకు రావడంలో విఫలం

పెర్కిట్: జిల్లాలో ప్రధాని మోదీ ప్రకటించిన పసుపు బోర్డుకు కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి విఫలమయ్యారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఆలూర్ శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పసుపు బోర్డు ఏర్పాటు చేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడుపుతారని ఎంపీ, ఎమ్మెల్యేగా గెలిపిస్తే జిల్లా ప్రజలకు వారు చేసిందేమి లేదన్నారు. రైతులు తిరుగుబాటు చేయకముందే నిధులు మంజూరయ్యేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

విద్యారంగానికి అరకొర నిధులు

ఆర్మూర్‌టౌన్: విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించడం సరైంది కాదని, బడ్జెట్‌ను సవరించి నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు ప్రిన్స్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కైఫ్, రహీబ్, నిశాంత్ పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం

డొంకేశ్వర్: వర్షాలు బాగా కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని డొంకేశ్వర్ వీడీసీ సభ్యులు, గ్రామ ప్రజలు గురువారం గంగనీళ్లకు వెళ్లారు. చేపలు పట్టే వలలతో ఊరేగింపుగా వెళ్లి నది జలాలను తెచ్చి గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. పూజలు చేసి మొక్కలు చెల్లించుకున్నారు.


లోతట్టు ప్రాంతం సందర్శన

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిదిధిలోని సంతోష్‌నగర్‌లో ఉన్న లోతట్టు ప్రాంతమైన సిక్కుల కాలనీని స్థానిక కౌన్సిలర్ ఖాందేశ్ సంగీత గురువారం సందర్శించారు. కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాయకులు ఖాందేశ్ సత్యం, మేతా బ్ సింగ్, హర్భజన్ సింగ్, బల్బీర్ సింగ్, మున్సిపల్ సిబ్బంది శంకర్, కాలనీవాసులు ఉన్నారు.

ప్రజాసమస్యలపై పోరాడాలి

మోర్తాడ్: రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ప్రజల సమస్యలపై బీజేపీ కార్యకర్తలు పోరాటం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు పుప్పాల నరేశ్ సూచించారు. మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బోగ దేవేందర్, జైడి గంగారెడ్డి, కుంట శ్రీనివాస్, ఒడ్డెం ప్రశాంత్, కోరం ప్రకాశ్, లక్ష్మీనర్సయ్య, గోపిడి గంగారెడ్డి, రాముగౌడ్, రంజిత్, వి. గంగారెడ్డి, వినాయక్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వర్, రాజె మోహన్, సవీన్, నవీన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవం వేగవంతం చేయాలి



భీమ్‌గల్: వనమహోత్సవంలో భాగంగా మండలంలోని మెండోరా, బాబానగర్, బాబాపూర్ గ్రామాలను ఎంపీడీవో సంతోష్ కుమార్ గురువారం పర్యటించి మొక్కలు నాటారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నందున కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఏపీవో నర్సయ్య, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

అర్చకురాలికి అంత్యక్రియలు



రెంజల్: యాభై ఏళ్ల క్రితం గ్రామానికి వచ్చి స్థానిక శివాలయంలో పూజలు నిర్వహిస్తూ మహిళా అర్చకురాలిగా మారిన మహిళ గురువారం మృతి చెందడంతో గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించారు. కామారెడ్డి ప్రాంతానికి చెందిన గురమ్మ(80) సుమారు యాభై ఏళ్ల క్రితం మండలంలోని కూనేపల్లికి వచ్చి స్థానిక శివాలయంలో నిత్య పూజలు చేసేవారు. రెండేళ్లుగా ఆమె అనారోగ్యంతో బాధపడటంతో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో వైద్య చికిత్సలు చేయించారు. గురువారం మృతి చెందడంతో గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించారు.

చెరువులకు జలకళ



నిండు కుండను తలపిస్తున్న చిక్కడపల్లి చెరువు



ముప్కాల్: పొలాల్లో చేరిన వర్షపు నీరు

రుద్రూర్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని చెరువులు జలకళను సంతరించుకున్నాయి. రుద్రూర్, చిక్కడపల్లి, కొందాపూర్ చెరువుల అలుగులు ప్రవహిస్తున్నాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో 17 ఇళ్లు కురుస్తున్న వర్షానికి కూలిపోయాయి. రాణంపల్లిలో 10, రుద్రూర్‌లో 5, రాయకూర్‌లో రెండు ఇళ్లు కూలినట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నజీర్ గ్రామాల్లో పర్యటించి వరద నష్టం వివరాలు సేకరిస్తున్నారు. మండలంలో గురువారం 27.2 వర్షపాతం నమోదైంది.

బాల్కొండలో..

బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల్లో రెండు రోజులుగా విస్తరంగా వర్షం కురుస్తోంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్ల మధ్యలోకి వర్షపు నీరు వచ్చి చేరుతోంది. పంట పొలాల్లో వేసిన వరినాట్లు అధిక వర్షానికి కొట్టుకుపోతున్నాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. గ్రామాల్లో పాత ఇళ్లలో నివాసం ఉంటున్న వారు వెంటనే ఖాళీ చేయాలని అధికారులు సూచనలు చేస్తున్నారు.

గ్రామాల్లో గస్తీ నిర్వహించాలి

వేల్పూర్: మండలంలోని గ్రామాల్లో దొంగతనాలు పెరుగుతున్నందున యువకులు రాత్రివేళ గస్తీ నిర్వహించాలని ఎస్సై వినయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ఇంట్లో బంగారు, వెండి వస్తువులు, నగదు ఉంచుకోవద్దని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా అపరిచితులు కనిపిస్తే వెంటనే డయల్ 100, 8712659862 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

రైతులకు వ్యతిరేకంగా బడ్జెట్

మాక్లూర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతు, కార్మిక వర్గాలకు వ్యతిరేఖంగా ఉందని న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ దాసు విమర్శించారు. మండలంలోని మానిక్‌బండార్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. టీడీపీ, జేడీయూలకు ప్రాధాన్యతనిచ్చి తెలంగాణపై వివక్షచూపారని ఆరోపించారు. కార్యక్రమంలో వేల్పూర్ భూమయ్య, దేశెట్టి సాయిరెడ్డి, టి కృష్ణాగౌడ్, రవి, నరేశ్ పాల్గొన్నారు.

తండ్రి జ్ఞాపకార్థం తనయుల సేవ కార్యక్రమాలు



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న సీఐ,ఎంఈవో

పెర్కిట్: తల్లిలేని లోటును తీరుస్తూ కష్టపడి పెంచి ఉన్నతస్థాయికి చేర్చిన తండ్రి జ్ఞాపకార్థం సేవ కార్యక్రమాలు చేపడుతున్న మినుగు రాజ గంగారాం, మినుగు పోలీస్ రాజేశ్వర్ అభినందనీయులని ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి, ఎంఈవో రాజ గంగారాం కొనియాడారు. మండలంలోని చేపూర్‌కు చెందిన మినుగు లస్మన్న 11వ వర్ధంతిని పురస్కరించుకుని వారి కుమారులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం నోట్‌బుక్స్‌లను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చేతన కుమారి, సురేష్ రుక్మాజి, సత్యనారాయణ, కుస్తాపురం గంగారెడ్డి, లింగం గౌడ్, రాజ శేఖర్, డిష్ రాజు, జన్నెపల్లి గంగాధర్, సిందూకర్ చరణ్, డాక్టర్ శంకర్ దాస్, సారంగి శాంతి కుమారి, షాహీద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఎన్నికలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని గురుకుల డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు గురువారం ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థినులు కెప్టెన్, వైస్ కెప్టెన్, సెక్రటరి, సాంస్కృతిక, గ్రంథాలయ, హైజీనిక్ విభాగంలో పలు స్థానాలకు పోటీ పడ్డారు. అధ్యాపకులు సైతం ఓటు వేశారు. ఈ ఎన్నికలతో విద్యార్థినులకు ఓటింగ్ వ్యవస్థపై అవగాహన ఓటు వేసే విధానం, ఓటు ప్రాధాన్యత తెలుస్తుందని ప్రిన్సిపాల్ ధనవేణి అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుజాత, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



ఎన్నికైన ఫొటో, వీడియో గ్రాఫర్ల నూతన సభ్యులు



ఎన్నికైన బ్రాహ్మణ సేవ సమాజ్ సభ్యులు

నూతన కార్యవర్గం ఎన్నిక

బాల్కొండ: మండల ఫొటో, వీడియో గ్రాఫర్ల నూతన కార్యవర్గాన్ని మండల కేంద్రంలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సింధూల రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా గడ్డం హరీశ్, కోశాదికారిగా మేక సాయినాథ్, ఉపాధ్యక్షుడిగా పొన్న రాకేశ్, అదనపు కార్యదర్శిగా నగేశ్ ఎన్నికయ్యారు.

బ్రాహ్మణ సేవ సమాజ్..

బోధన్: బ్రాహ్మణ సేవ సమాజ్ బోధన్ పట్టణ నూతన కార్యవర్గాన్ని సభ్యులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమాజ్ గౌరవ అధ్యక్షుడిగా వినోద్ పట్వారీ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా అశోక్ కులకర్ణి, అధ్యక్షుడిగా ప్రవీణ్ మహరాజ్, ఉపాధ్యక్షులుగా యోగిరాజ్‌వైద్య, విజయ్‌కుమార్ కులకర్ణి, ప్రధాన కార్యదర్శిగా ఉమానంద్ వైద్య, సహాయ కార్యదర్శులుగా రాజు కులకర్ణి, మహేశ్‌జోషి, భాస్కరాచార్య, సంతోష్, కోశాధికారిగా ఐఆర్ చక్రవర్తి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా మనీషా మనోజ్‌వైద్య, ప్రతినిధులుగా రాజశ్రీ భాస్కరా చార్య, జ్యోత్స్న పాఠక్, యమునా భాస్కరాచార్య ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా గణేశ్ కులకర్ణి ఎన్నికైన వారికి నియామక పత్రాలను అందించి ప్రమాణస్వీకారం చేయించారు.

సంక్షిప్తం

ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు

భీమ్‌గల్: రుణమాఫీ సమస్యల పరిష్కారానికి మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి సాయికృష్ణ గురువారం పేర్కొన్నారు. రూ. లక్ష లోపు రుణం తీసుకొని మాఫీ కాని రైతులకు ఏవైనా సమస్యలు ఉంటే కార్యాలయానికి వచ్చి తెలుసుకోవాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

వేల్పూర్: రామన్నపేట్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు సుదాం లక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి రసూల్ బీ, భీమ్‌గల్ సీడీపీవో స్వర్ణలత గురువారం ప్రారంభించారు. గ్రామస్తులు తమ మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలకిషన్, హెచ్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ రోడ్డు బాగు చేయాలి

రుద్రూర్: మండలంలోని అంబం(ఆర్) శివారులో ఉన్న మోడల్ స్కూల్‌కు వెళ్లే రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారిందని వెంటనే అధికారులు రోడ్డును బాగు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు కార్తీక్ గురువారం డిమాండ్ చేశారు. కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి బురదమయం కావడంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

ఎస్సైని కలిసిన సాధన సంస్థ సభ్యులు

భీమ్‌గల్: కైలేష్ సత్యర్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ సహకారంతో చేపడుతున్న యాక్సెస్ టు జస్టిస్ ప్రాజెక్టులో భాగంగా సాధన సంస్థ సభ్యులు ఎస్సై హరిబాబును గురువారం కలిశారు. సంస్థ కో–ఆర్డినేటర్ సంగీత, కమ్యూనిటీ మొబలైజర్ నిరీక్షణ బాలల హక్కులు, బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణపై సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే చర్యల గురించి ఎస్సైకు వివరించారు. సంస్థ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బకాయి వేతనాలకు నిధులు కేటాయించాలి

బోధన్: నిజాంషుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు రావాల్సిన బకాయి వేతనాల కోసం రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ఎన్డీఎస్ఎల్ మజ్దూర్ సభ యూనియన్ బోధన్ శాఖ ప్రధాన కార్యదర్శి ఉపేందర్ ప్రభుత్వాన్ని గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణలో భాగంగా రోల్‌లో ఉన్న కార్మికులకు వెంటనే విధుల్లోకి తీసుకోవాలని పేర్కొన్నారు. అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క నిజాంషుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని ప్రకటించడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్డీఎస్ఎల్ కార్మికుల హర్షం

బోధన్: మూతపడిన నిజాం షుగర్ ఫ్యాక్టరీలను త్వరలో తెరిపిస్తామని అసెంబ్లీ బడ్జెట్‌లో ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క పేర్కొనడంపై పట్టణంలోని ఫ్యాక్టరీ ప్రధాన గేట్ వద్ద కార్మికులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాంబాబు, శ్రీనివాస్, బాలకృష్ణ, భాస్కర్, సత్యనారాయణ, లియాకత్ అలీ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బోధన్‌లో కార్గిల్ విజయ్ దివస్

బోధన్: సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్గిల్ విజయ్ దివస్ జూబ్లీ వేడుకలు నిర్వహించనున్నట్లు ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ధర్మనాయక్ గురువారం పేర్కొన్నారు. కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు హాజరు కానున్నట్లు వెల్లడించారు.

క్రీడా దుస్తుల వితరణ

వేల్పూర్: మండలంలోని మోతె ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 30 క్రీడా దుస్తులను పూర్వ విద్యార్థి ఆనంద్ గురువారం వితరణ చేశారు. తన తల్లి గంగు చేతుల మీదుగా వాటిని విద్యార్థులకు అందజేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం గణేశ్, టీచర్లు రత్నయ్య, కవిత, సురేశ్ పాల్గొన్నారు.

ఎడిటర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్నిక

నిజామాబాద్ నాగారం: ది ఎడిటర్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కానుకంటి శివప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నిరంతర జ్వాల పత్రిక ఎడిటర్ కానుకంటి శివప్రసాద్ను ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని అసోసియేషన్ అధ్యక్షులు సింగోజు దేవిదాస్ తెలియజేశారు. అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ సిరిగాద ప్రసాద్, క్యాషియర్ సురేందర్, మండే మోహన్, రవిబాబు, రాజలింగం, అక్షరం ప్రసాద్, విజయ్ పాల్గొన్నారు.

విచారణ చేపట్టి న్యాయం చేయండి



ఇంటి పత్రాలను చూపుతున్న విజయ్

ఎడపల్లి: ఇంటి పన్ను చెల్లించినా రసీదు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న గ్రామ కార్యదర్శిపై అధికారులు చర్యలు తీసుకోవాలని జానకంపేట్‌కు చెందిన మేకల విజయ్ కోరారు. ఎడపల్లి ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తన తండ్రి విఠల్ 1996లో రాజయ్య అనే వ్యక్తి నుంచి ఇంటిని కొనుగోలు చేశారని అనంతరం తన అక్కపై జీపీలో మార్చారని తెలిపారు. ఈ స్థలాన్ని కొందరు అక్రమార్కులు కబ్జా చేశారని వారికి జీపీ కార్యదర్శి వత్తాసు పలుకుతున్నారని అన్నారు.

ఈ విషయమై జీపీ కార్యదర్శి పి ప్రభుదాస్‌ను వివరణ కోరగా మేకల విజయ్ ఇంటి సమస్య తన దృష్టికి రాలేదని, జీపీకి వచ్చి ఇష్టారీతిన మాట్లాడితే కేసు పెడతానని చెప్పినట్లు పేర్కొన్నారు. సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తామని, విజయ్ దగ్గర డాక్యుమెంట్ ఉంటే ఇంట్లో ఉన్న వారిని ఖాళీ చేయించుకోవాలని దీనికి జీపీతో సంబంధం లేదని వెల్లడించారు.



ఘనంగా బోనాల పండుగ

బాల్కొండ: మండలకేంద్రంలోని శాంభవి పాఠశాలలో బోనాల పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు బోనాలను ఎత్తుకుని పోచమ్మ ఆలయంలో అమ్మవారికి సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులు చేసిన పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



చిక్లిలో పనులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో శ్రీనివాస్



దొన్కల్‌లో పనులను పరిశీలిస్తున్న ఎంపీవో



ఆలూర్‌లో..

మాక్లూర్: మండలంలోని చిక్లిలో పారిశుధ్య సిబ్బంది చేపడుతున్న పనులను డీఎల్‌పీవో శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. ఏకదాటిగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నవీన్, కారొబార్ సాయిలు ఉన్నారు.

వేగంగా పారిశుధ్య పనులు

మోర్తాడ్: వర్షాలతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి ప్రజలకు విష జ్వరాలు సోకుతాయనే ఉద్దేశంతో గ్రామాల్లో పారిశుధ్య పనులను వేగంగా నిర్వహిస్తున్నట్లు ఎంపీవో శ్రీధర్ పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని దొన్కల్, ధర్మోరా, శెట్‌పల్లిలో పారిశుధ్య పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యదర్శి స్వప్న, సిబ్బంది ఉన్నారు.

కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి

రుద్రూర్: ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నందున కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని కోటగిరి మండల పంచాయతీ అధికారి చందర్ సూచించారు. గురువారం కోటగిరి మండలం అడ్కాస్‌పల్లి, బస్వాపూర్, దేవుని గుట్ట తండా, కొత్తపల్లి గ్రామాలను పర్యటించారు. రోడ్లపై నిలిచిన వరద నీటిని, డ్రైనేజీలను శుభ్రం చేయించారు. శిథిలావస్థకు చేరిన పాత ఇళ్లలో ఉన్న వారిని కమ్యూనిటీ కేంద్రాల్లో ఉంచి వసతి ఏర్పాటు చేయాలని జీపీ కార్యదర్శులను ఆదేశించారు.

వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలి

వర్ని: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పంచాయతీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఎంపీవో మారుతి సూచించారు. మండలంలోని సత్యనారాయణపురం, వద్దేపల్లి గ్రామాల్లో పారిశుధ్య పనులను గురువారం పరిశీలించారు. మురికి కాలువలు, రోడ్లు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పెర్కిట్‌లో..

పెర్కిట్: ఆర్మూర్‌తో పాటు ఆలూర్ మండలాల ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీవో శ్రీనివాస్ సూచించారు. ఆలూర్ మండల కేంద్రంలో గురువారం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అనంతరం మురికి కాలువల్లో పేరుకుపోయిన పూడికను జేసీబీతో తొలగించారు. కార్యదర్శి రాజలింగం, సిబ్బంది ఉన్నారు.

వర్షపు నీరు తొలగించుటకు చర్యలు

బాల్కొండ: కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో గురువారం బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని గ్రామాల్లో వర్షపు నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టారు. బాల్కొండ మండల కేంద్రంలో పలు కాలనీలు వర్షపు నీటితో చెరువులను తలపించాయి. దీంతో జేసీబీలతో తవ్వకాలు చేపట్టి నీటిని తొలగించారు. బాల్కొండలో ఎంపీవో గంగామోహన్, ముప్కాల్‌లో ఎంపీవో గౌస్ మొహినొద్దీన్, మెండోరాలో డీఎల్‌పీవో శివకృష్ణ పనులను పర్యవేక్షించారు. వారి వెంట అధికారులు, సిబ్బంది ఉన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ



మోర్తాడ్: జలాల్‌పూర్ నుంచి మోర్తాడ్‌లోని మిషన్ భగీరథ పంప్‌హౌస్‌కు నీటిని సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్‌కు వారం రోజుల వ్యవధిలో మరోసారి లీకేజీ ఏర్పడింది. ఇటీవల పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడి ఏర్పడడంతో దానిని సరి చేయించారు. అంతలోనే మరోసారి లీకేజీ కావడంతో నీరు వృథాగా పోతోంది. సరైన చర్యలు తీసుకోకపోవడంతోనే తరచూ లీకేజీలు ఏర్పడుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇకనైనా అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మత్తులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

పంట పొలాల్లో నిల్వ నీటిని తీసేయాలి

రుద్రూర్: రెండు వారాలుగా కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లో నిల్వ ఉన్న నీటిని తీసేయాలని రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రానున్న రెండు రోజుల్లో తేలిక పాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని పొలాల్లో మందులను పిచికారీ చేయడం తాత్కాలికంగా వాయిదావేయాలని సూచించారు. రైతులు విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, చెట్లకింద ఉండవద్దని, పశువులను, మేకలను చెట్లకింద ఉంచవద్దని సూచించారు.

విద్యారంగానికి నిధులు కేటాయించాలి

భీమ్‌గల్: బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించిన నిధులు సరిపోవని, ప్రభుత్వం వెంటనే స్పందించి అధిక నిధులు కేటాయించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్క జనార్దన్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పలు పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయని వాటికి నూతన భవనాలు నిర్మించాలని కోరారు. అంగన్‌వాడీల్లో 3వ తరగతి వరకు ప్రాథమిక విద్యను విలీనం చేయాలని నిర్ణయించటం తగదని వెంటనే దానిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పనులను త్వరగా పూర్తి చేయాలి

రెంజల్: అమ్మ ఆదర్శ పాఠశాల్లో మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయించాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. మండలంలోని దూపల్లి ప్రాథమిక, హైస్కూల్ పాఠశాలల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. మాజీ సర్పంచ్ బాబులు, సోమలింగంగౌడ్, సలాం ఉన్నారు.

విద్యార్థులు వ్యాధులకు గురికాకుండా చూడాలి

ఆర్మూర్‌టౌన్: వర్షాలు కురుస్తున్నందున విద్యార్థు లు సీజనల్ వ్యాధులకు గురికాకుండా ఉపాధ్యాయులు చూడాలని మున్సిపల్ కమిషనర్ రాజు సూచించారు. మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ఉన్న కే జీబీవీ, మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను కమిషనర్ గురువారం సందర్శించారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. పాఠశాల వంట గదులను, మరుగుదొడ్లను పరిశీలించారు. శానిటరీ ఎస్సై గజానంద్, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ పూర్ణమౌళి, ఉపాధ్యాయులు ఉన్నారు.

వ్యాధులను అదుపులోకి తెచ్చాం

మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లిలో నెల రోజులుగా ప్రజల్ని పీడిస్తున్న సీజనల్ వ్యాధులను అదుపులోకి తెచ్చామని మండల వైద్యాధికారి ప్రకాశ్‌కుమార్, విస్తర్ణ అధికారి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. వారం రోజులుగా గ్రామంలో కొనసాగుతున్న వైద్య శిబిరాన్ని గురువారం తొలగించినట్లు పేర్కొన్నారు. అపరిశుభ్రతతోనే ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడ్డారన్నారు. శిబిరంలో 150 మంది రోగులను పరీక్షించగా 41 మందికి రక్త పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సరిత, భాగ్యలక్ష్మి సుజాత, శ్రీలేఖ, పద్మావతి, శ్రీలత పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	ట్విస్టర్ (హిందీ) - 11.50, 6.40, 9.30
	భారతీయుడు-2 (తెలుగు) - 02.45
స్క్రీన్-2 –	కల్కి - 2898 ఏడి (3డీ-తెలుగు) - 11.00, 2.45, 6.30, 10.15
స్క్రీన్-3 –	డార్లింగ్ (తెలుగు) - 11.45, 3.05, 6.25, 9.45
స్క్రీన్-4 –	ది బర్త్‌డే బాయ్ (తెలుగు) - 02.20,
	క్రైమ్ రీల్ (తెలుగు) - 5.00
	పేకమేడలు (తెలుగు) - 7.35
	భారతీయుడు-2 (తెలుగు) - 10.15